క్లుప్తంగా

రేపు ఫ్రెండ్లీ వాలీబాల్ టోర్నమెంట్

మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదేశాల మేరకు ఈ నెల 3వ తేదీ అమ్రాబాద్ మండల స్థాయి వాలీబాల్ పోటీలు మన్ననూర్‌లో నిర్వహిస్తున్నట్లు క్రీడల ఇన్‌చార్జ్ ఏఆర్ ఎస్‌ఐ గౌస్ పాషా తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక గిరిజన ఉన్నత పాఠశాల ఆవరణలో వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పాల్గొనే జట్లకు క్రీడా దుస్తులు, వాలీబాల్, నెట్ అందజేస్తామని తెలిపారు.

గోరింటాకు ఉత్సవం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆషాఢమాసం పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళలు గురువారం గోరింటాకు ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. అనంతరం మహిళలంతా గోరింటాకు పెట్టుకొని ప్రదర్శించి సంబురపడ్డారు.

పింఛన్ కోసం రోడ్డెక్కిన వృద్ధులు



తాడూరు: ప్రతి నెల సకాలంలో పింఛన్ ఇవ్వడం లేదని బుధవారం మండల కేంద్రంలో ఏపీజీవీబీ ఎదుట వృద్ధులు రాస్తారోకో నిర్వహించారు. బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వృద్ధుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్యాంక్ అధికారులతో పోలీసులు మాట్లాడారు. రుణమాఫీ కారణంగా రైతుల రద్దీ అధికంగా ఉందని, సైట్ కూడా సరిగ్గా రావడం లేదని వివరించారు. రెండు రోజుల్లో పింఛన్ ఇస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ముమ్మరంగా సభ్యత్వ నమోదు

కల్వకుర్తిరూరల్: మండలంలోని సుద్దకల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం స్టేట్ టీచర్స్ యూనియన్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, కల్వకుర్తి శాఖ అధ్యక్షుడు జమీల్‌అహ్మద్, కార్యదర్శి శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన అర్హులైన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ మంజుల గురువార ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని మొత్తం 19,109 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు 15,574మంది మాత్రమే రైతు బీమా కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. ఈనెల 5వ తేది వరకు గడువు ఉందని పేర్కొన్నారు.

ఉప్పునుంతల: జూన్ 28వ తేదీలోపు పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. 771 మంది రైతులకు గాను 420 మంది దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌లను జతచేసి రైతువేదికలోని ఏఈఓలకు అందించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు భోజనం వడ్డించాలి

పెంట్లవెల్లి: విద్యార్థులకు భోజనం వడ్డించాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు సులిగిరి తరుణ్ డిమాండ్ చేశారు. గురువారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ప్రభాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ మండలంలోని పలు పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయడం లేదని విద్యార్థులు పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొందని వివరించారు. కొందరు టిఫిన్ బాక్స్‌లను ఇంటి నుంచే తీసుకొస్తున్నారన్నారు. మండలంలోని జటప్రోల్, మాధవస్వామినగర్, ఎంగంపల్లితండా గ్రామాల్లో సమస్య ఉందని తెలిపారు.

కాంగ్రెస్‌పై విమర్శలు తగదు

నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నాయకుల విమర్శలు తగదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు అన్నారు. బిజినేపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లపాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం దోచుకుందని విమర్శించారు. ప్రజా పాలనపై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. వట్టెం మాజీ సర్పంచ్ బత్తిని అమృత్ రెడ్డి ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘటన సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు బంగారు పర్వతాలు, కేటీ తిరుపతయ్య, ముక్తార్ పాషా, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మలిశెట్టి వెంకటస్వామి, బాలరాజ్, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



నాగర్‌కర్నూల్‌లో బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



తెలకపల్లిలో ..

నాగర్‌కర్నూల్: శాసనసభలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు బీఆర్‌ఎస్ నాయకులు ఖండించారు. గురువారం జిల్లా కేంద్రంలో బస్టాండ్ కూడలిలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీఆర్‌ఎస్ నాయకులకు మధ్య కొంతసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం బీఆర్‌ఎస్ నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ ఆవరణలో మున్సిపల్ చైర్మన్ కల్పనా భాస్కర్‌గౌడ్, వైస్‌చైర్మన్ బాబురావులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజినేపల్లిలో..
అసెంబ్లీలో సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బిజినేపల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, పులెందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు. మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, పార్టీ అధ్యక్షుడు విజయ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ వంగూరు గోవర్ధన్, సూర్యప్రకాష్‌రావు, లింగం, కిశోర్, గణేష్ తదితరులు ఉన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. బొమ్మసాని నర్సింహ, భాషమోని రాములు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మమ్మ, రమేష్, మాధవరెడ్డి, లక్ష్మారెడ్డి, సుందర్‌రెడ్డి, సత్యనారాయణ, పర్వతాలు, సురేష్, గోవర్ధన్‌రెడ్డి, మైమూద్, విష్ణు, జమ్ములు తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదగిరి, నాయకులు చల్లా మధుసూదన్‌రెడ్డి, పోలే అశోక్, ఆనంద్, ప్రవీణ్, రవికుమార్, కొండల్‌యాదవ్, చంద్రశేఖర్, శేఖర్, వెంకటేష్, శ్రీను, మల్లేష్, గణేష్, వెంకటేష్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

ఊర్కొండ: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనాన్ని ఎస్‌ఐ వీరబాబు తన సిబ్బందితో అడ్డుకున్నారు. గిరినాయక్, మాజీ సర్పంచ్‌లు కొమ్ము రాజయ్య, కృష్ణగౌడ్, మ్యాకల శ్రీనివాసులు, సాంబశివుడు, నాయకులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంచందర్‌యాదవ్ మాట్లాడారు. సీఎం స్థాయి వ్యక్తి బాధ్యతా రాహిత్యంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సమావేశంలో నాయకులు డీకే మాదిగ, గోపి, పలక రాముడు, ఖాదర్, రాజు, మహేష్, శేఖర్ తదితరులున్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వంశీనాయక్, శంకర్, వెంకటయ్య, సైదులు, సమ్మద్, కరుణాకర్ పాల్గొన్నారు.



కల్వకుర్తిలో..



ఊర్కొండలో అడ్డుకుంటున్న పోలీసులు



అచ్చంపేటలో బాణాసంచా కాల్చుతున్న వివిధ సంఘాల నాయకులు



లింగాలలో సంబరాలలో ఎమ్మార్పీఎస్ శ్రేణులు

వర్గీకరణపై సంబరాలు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును హర్షిస్తూ గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ సంఘం జాతీయ నాయకుడు వంగూరు జయశంకర్ మాట్లాడారు. మాదిగల చిరకాల స్వప్నం నెరవేరిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి శాసన సభలో కోర్టు తీర్పును గౌరవించి ఎస్సీ వర్గీకరణ అంశాన్ని త్వరలో చేపడుతామని ప్రకటించడం సంతోషకరమన్నారు. నాయకులు కొమ్ము ఆనంద్, నాయకులు వెంకటయ్య, హుస్సేన్, మల్లేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి, అంబట్‌పల్లిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. స్వీట్లను పంచుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ మండల నాయకులు మొల్క బంగారయ్య ఉన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్, వివిధ కుల, ప్రజా సంఘాల నాయకులు సంబరాలు బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశీం, మహేష్, వెంకటేష్, సాంబయ్య, మస్తాన్, వెంకటయ్య, శంకర్, తిరుపతయ్య, బాల్‌రాజు, రాజు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రమోని యాదగిరి మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మంద నర్సింహ్మమాదిగలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రధాన కూడళ్లలో బాణసంచాలు కాల్చారు. స్థానికులకు మిఠాయిలు పంచారు. సంపంగి మద్దిలేటి, పుట్టపాగ రాము, సులిగిరి శ్రీనివాసులు, కలమూరి నిరంజన్, లక్ష్మణ్, డీకే.మాదిగ, బోరెల్లి సంఘెం, శీలం అగ్రస్వామి, ఆటో రాముడు తదితరులున్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. మందకృష్ణ మాదిగ చేసిన పోరాటం ఫలించిందన్నారు. బాలస్వామి, రామకృష్ణ, మహేష్, అర్జున్, యాదగిరి, బాలమశయ్య, నాగబాబు, విష్ణు పాల్గొన్నారు.

వెల్దండ: సుప్రీం కోర్టు తీర్పును జేఏసీ జిల్లా అధ్యక్షుడు పోలె రాజు స్వాగతించారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలో ర్యాలీ నిర్వహించి బాణాసంచా కాల్చారు.

దోమలపెంట: బస్టాండ్ ప్రాంగణంలో మాదిగ ఐక్య వేదిక నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బి.ప్రసాద్, ఎస్.తిమ్మప్ప, హనుమంతు, కొండయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో..



పెద్దకొత్తపల్లిలో ..

మొక్కలు నాటి సంరక్షిద్దాం

అచ్చంపేట: మొక్కలు నాటి సంరక్షిద్దామని డీసీసీబీ మేనేజర్ రవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని డీసీసీబీ బ్యాంకు ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కవిత, మోహన్, శ్రీను, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో పీఏసీఎస్ కార్యాలయంలో ఆవరణంలో గురువారం వన మహోత్సవంలో భాగంగా పీఏసీఎస్ చైర్మన్ గుర్వయ్య గౌడ్ పండ్ల, వివిధ రకాల మొక్కలు నాటారు. అనంతరం కల్వకుర్తి డీసీసీ బ్యాంకు ఆవరణంలో మామిడి మొక్కను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రాఘవేందర్, సీఈఓ వెంకటయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.



డీసీసీబీ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు

డ్రమ్‌సీడర్ ద్వారా వరి విత్తనాలు వేసుకోవాలి

పెద్దకొత్తపల్లి: డ్రమ్‌సీడర్ ద్వారా వరి విత్తనాలు వేసుకోవాని రైతులను ఏఈఓ జానకిరాం కోరారు. మండలంలోని పెద్దకార్పాములలో గడ్డంపల్లి బాలరాజు వ్యవసాయ పొలంలో గురువారం డ్రమ్‌సీడర్ ద్వార వరి విత్తనాలను వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రమ్‌సీడర్ ద్వారా ఎకరాకు 10 కిలోల విత్తనాలు సరిపోతాయని, అదే నాట్లు వేసే పద్ధతిలో అయితే 30 కిలోల విత్తనాలు అవసరం అవుతాయని పేర్కొన్నారు. డ్రమ్ సీడర్‌ను ఉపయోగించడం వల్ల కూలీల ఖర్చు తగ్గుతుందని వివరించారు. రైతులు శ్రీనివాస్‌రెడ్డి, పరుశరాముడు, బాఆలమణి, బాలస్వామి పాల్గొన్నారు.

విద్యా బోధనపై ప్రత్యేక దృష్టి

తాడూరు: విద్యా బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో రెండు రోజులపాటు నిర్వహించిన కాంప్లెక్స్ మీటింగ్ సమావేశం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యాబోధన, తరగతుల నిర్వహణ, మధ్యాహ్న భోజనం వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా విద్యార్థులు సామర్థ్యాలు, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రిజిస్టర్ నిర్వహణ, తరగతి గదిలో బోధన, బడి బయట ఉన్న పిల్లల వివరాలు వివిధ అంశాలపై చర్చించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయం సరికాదు


మన్ననూర్: నల్లమల ప్రాంతంలోని అన్ని గ్రామాలు, పెంటలలోని చెంచులకు తెలియకుండా చెంచు నాయకుడు మల్లికార్జున్ స్వంత ఎజెండాతో పాదయాత్రకు పూనుకోవడం సరైన విధానం కాదని చెంచు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నాగయ్య, ఉపాధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మన్ననూర్‌లోని అంబేడ్కర్ కూడలిలో వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో సర్పంచ్‌గా పదవి చేపట్టి చెంచుల హక్కులు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయలేకపోయారని విమర్శించారు. ప్రజాపాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే చర్యలకు పాల్పడటం ఏమిటని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా మల్లికార్జున్ సొంత నిర్ణయాలు కాకుండా చెంచుల అభిప్రాయాల మేరకు నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హరినారాయణ, బాలయ్య పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. లింగాల మండంలోని రాయవరంలో ర్యాలీ వెళ్లి తల్లిపాల విశిష్టతను వివరించారు. అచ్చంపేట ప్రాజెక్టు మన్ననూర్ సెక్టార్ పరిధిలోని స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ దమయంతి హాజరయ్యారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలోని వడ్డెరబస్తీలో పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి పేర్కొన్నారు. కోడేరు మండల కేద్రంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గా హాజరై మాట్లాడారు. తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. చారకొండ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రశిదున్నిసా పాల్గొన్నారు. సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, పద్మావతి,గిరిజ, అంగన్‌వాడీ టీచర్లు గీత, వనజ, మంజుల, లలిత, జయమ్మ, రాణి, జయమ్మ, కృష్ణవేణి, మాధవి, ఆశ వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



తాడూరు: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని కళాకారుడు జల్లి కృష్ణ, భాస్కర్‌లు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అర్థమయ్యేవిధంగా ఆట పాటలతో వివరించారు. కార్యక్రమంలో కళాకారులు శివనాగులు, పార్వతమ్మ, నరేందర్, రేణుక పాల్గొన్నారు.

ఘన వీడ్కోలు

కల్వకుర్తిరూరల్: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్యదర్శులు బదిలీ అయ్యారు. అదేవిధంగా కల్వకుర్తికి వచ్చిన కార్యదర్శులను గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఘనంగా సన్మానించి వీడ్కోలు, స్వాగతం పలికారు. ఎంపీఓ దేవేందర్ పెంట్లవెల్లికి బదిలీ కాగా వెల్దండ నుంచి సునీత ఎంపీఓగా కల్వకుర్తి బదిలీ వచ్చారు. ఏఈగా షబ్బీర్‌అహ్మద్ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన, బదిలీ అయిన అధికారులను ఎంపీడీఓ వెంకటరాములు సన్మానించారు.

సీపీఎం బృందం పర్యటన

తెలకపల్లి: మండలంలోని పెద్దూరు, బొప్పల్లి, గడ్డంపల్లి, కార్వంగ గ్రామాల్లో ప్రజా సమస్యల అధ్యయన యాత్రలో భాగంగా గురువారం ఆయా గ్రామాల్లో సీపీఎం బృందం పర్యటించింది.

నల్లమలను సస్యశ్యామలం చేస్తాం

బల్మూర్: కేఎల్‌ఐ ద్వారా సాగునీరు అందించి, నల్లమల ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని గట్టుతుమ్మెన్ స్టేజీ వద్ద కేఎల్‌ఐ కాల్వకు విడుదలైన కృష్ణాజలాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో సాగునీటి ప్రాజెక్టులు, కాల్వలు నిర్మించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని బల్మూర్, లింగాల, ఉప్పునుంతల, వంగూరు మండలాలకు కాల్వలను నిర్మించడంతో పాటు, ప్రాజెక్టుల నిర్మాణానికి రూపకల్పన జరిగిందన్నారు. త్వరలోనే బల్మూర్ వద్ద ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారన్నారు. రిజర్వాయర్ నిర్మాణానికి భూములు ఇచ్చే రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ మాణిక్య్ ప్రభు, మాజీ ఎంపీపీ అరుణ, జిల్లా కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ గిరివర్ధన్‌గౌడు, మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కాశన్న యాదవ్, జగపతిరావు, నారాయణ, రాంప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

తహసీల్దార్‌కు వినతి



చారకొండ: మండల కేంద్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కేసీ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు దేవరకొండ కల్వకుర్తి ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిందని వివరించారు. అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలను శుభ్రం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంజెఎస్ సెంట్రల్ కమిటీ మెంబర్ రాధాకృష్ణ మహరాజ్, మండల ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మల్లేష్, కొండల్, అయోధ్య, ఉదయ్, ప్రవీణ్, వెంకటయ్య, విజయ్, తదితరులు ఉన్నారు.

జర్నలిస్ట్‌పై అక్రమ కేసులు ఎత్తేయాలి

నాగర్‌కర్నూల్: బిజినేపల్లి మండలం పాత్రికేయుడు మధుసూదన్ రెడ్డిపై అక్రమ కేసులు ఎత్తేయాలని ఎస్పీకి జర్నలిస్టులు గురువారం వినతిపత్రం అందించారు. గురువారం జిల్లా కేంద్రానికి చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫొటో, వీడియో జర్నలిస్టులు ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌ను కలిశారు. ఘటనకు సంబంధించి పలు అంశాలను చర్చించారు. కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా జర్నలిస్టుపై కేసు పెట్టించారని వివరించారు. సీనియర్ జర్నలిస్టులు అబ్దుల్లా ఖాన్, కందికొండ మోహన్, పుట్టపాగ వెంకటస్వామి, జెమిని సురేష్, హౌదేకార్ ఉమాశంకర్, చంద్రశేఖర రావు, ఖానాపురం ప్రదీప్, రాజేష్ గౌడ్, కొండకింది మాధవరెడ్డి, ఏటిగడ్డ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

గుండెపోటుతో రజకసంఘం అధ్యక్షుడి మృతి

కొల్లాపూర్: పట్టణ రజక సంఘం అధ్యక్షుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తిప్పరాజుల శ్రీనివాసులు(50) గుండెపోటుతో గురువారం మృతిచెందాడు. బుధవారం రాత్రి చాతిలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం మెరుగుపడటంతో గురువారం ఉదయం ఇంటికి తీసుకొచ్చారు. మరోసారి గుండెనొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. ఆస్పత్రికి తరలించేలోపే శ్రీనివాసులు మృతిచెందాడు. బీఆర్‌ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, కట్టా శ్రీనివాసులు, కాటం జంబులయ్య, డీకే.మాదిగ, సీపీఎం నాయకులు ఈశ్వర్ తోపాటు, రజక సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘం, పలు ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి జి అశోక్ అన్నారు. గురువారం పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవి కాలం ముగిశాక పారిశుధ్యం లోపించిందని, తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని, వీధి దీపాలు ఏర్పాటు చేయడం లేదని వివరించారు. ప్రత్యేకాధికారులు తక్షణం గ్రామాలను సందర్శించి సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, సురేష్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్‌గా గోపాల్

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గురువారం గోపాల్ బాధ్యతలు చేపట్టారు. వెల్దండలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న సంజీవరెడ్డి రంగారెడ్డి జిల్లాలోని హయత్‌నగర్ బదిలీపై వెళ్లగా, నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ నుంచి వెల్దండకు గోపాల్ బదిలీపై వచ్చారు.

సారా విక్రయిస్తే చర్యలు

కల్వకుర్తి: సారా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ఎక్సైజ్ పరిధిలోని తర్నికల్ తండా, జీడిపల్లి, కల్వకుర్తి పట్టణంలో దాడులు నిర్వహించారు. 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకోగా 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేవారు. ఒక ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి, రెండు కేసులు నమోదు చేశామని ఆయన తెలిపారు. శారద, అరుణ, సిబ్బంది మహేష్, రఘు, మాధవి, సౌమ్య, తిరుపతిరెడ్డి దాడులలో పాల్గొన్నారు.

స్థానికసంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం

అచ్చంపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామని బీజేపీ సీనియర్ నాయకుడు బూషిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం అచ్చంపేట మండల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వరికుప్పల అంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. బూత్‌స్థాయి కమిటీలను పటిష్టం చేసి రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీలో నిలుస్తామన్నారు. గంగిశెట్టి నాగరాజు, దొడ్ల రాజవర్ధన్‌రెడ్డి, మోక్తాల రేణయ్య పాల్గొన్నారు.

సెల్‌టవర్ ఎక్కిన మృతుడి సోదరుడు

పెద్దకొత్తపల్లి: దేవినేనిపల్లి గ్రామానికి చెందిన బోడ కాశన్నను గతేడాది ఆగస్ట్ 1వ తేదీన హత్య చేశారు. హత్య కేసులోని నిందితులను అరెస్ట్ చేయాలని కోరుతూ పెద్దకొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్‌ను మృతుడి సోదరుడు శివ ఎక్కాడు. మూడు గంటల పాటు సెల్ టవర్‌పైనే ఆందోళన చేశాడు. డీఎస్పీ బాధితుడితో ఫోన్ ద్వారా మాట్లాడి నచ్చజెప్పారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో మృతుని కుటుంబ సభ్యులు శివ, మాజి ఉపసర్పంచ్ రామకృష్ణ వారి అనుచరులతో గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారులను శాంతింపజేశారు.

కేఎల్‌ఐ కాలువ పనులు త్వరగా పూర్తి చేయాలి

అచ్చంపేట రూరల్: మండలంలోని పులిజాల శివారులోని కేఎల్‌ఐ కాలువ పనులను త్వరగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దేశ్యానాయక్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో కాలువ పనులను పరిశీలించారు. పనులు నత్తనడకన సాగుతున్నాయని, త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. భూములు కోల్పోయిన రైతులకు భూసేకరణ చట్టం 2013 ప్రకారం ఎకరాకు రూ. 30లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాలువ నీటిని నడింపల్లి చెరువులోకి మళ్లించాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి మల్లేష్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సైదులు, రైతులు వెంకటయ్య, శివ, తిరుపతయ్య, గంగయ్య పాల్గొన్నారు.

వ్యక్తికి రిమాండ్

లింగాల: మండలంలోని సూరాపూర్‌కు చెందిన తిరుమలాపురం తిర్పతయ్య గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. భూ తగాదాకు సంబంధించి వ్యక్తిపై కోర్టులో కేసు నడుస్తుందని, కోర్టుకు హాజరుకావాలని సమన్లు అందుకున్నప్పటికి హాజరుకాలేదని ఎస్ఐ తెలిపారు. దీంతో జడ్జి ఆదేశాల మేరకు వ్యక్తిని అదుపులోకి తీసుకొని అచ్చంపేట కోర్టు హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

సులభ పద్ధతిలో బోధించాలి

వెల్దండ: విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధించాలని జీహెచ్‌ఎం రవీందర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా ఓరెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. శోభన్‌బాబు, విష్ణువర్ధన్, సంజీవ్, జ్ఞానేశ్వర్, తదితరులు ఉన్నారు.